# ఇది ప్రశ్న-అది జవాబు

శివయ్యగారు చెప్పటం పూర్తిచేసి కళ్ళు మూసుకున్నారు.

చావు బ్రతుకుల సంధి సమయంలా దురూహ్యమైన నిశ్శబ్దం అల ముకుంది. నేను చుట్టూ చూసేను. పాత కొంప. విజానకది ఇల్లనడానికి వీల్లేని కొట్టడి. చూరు పెంకులు రాలిపోయినై. కప్పు నిండా కంతలు. ఆ కంతలో నుంచి ప్రవేశించిన వెలుతురు మాత్రం అక్కడక్కడా నేలమీద వలయాలు సృష్టిస్తోంది.

నిన్న రాత్రి కురిసి వెలిసిన వాన చినుకుల వలన నేలంతా చిత్తడి చిత్తడిగా వుంది. నిట్టాడి దూలానికి ఒక దీపంబుడ్డి-శివయ్యగారి జీవితాన్ని సూచిస్తూ-పొగచూరి పోయి వుంది. ఒక మూల రెండు అల్యూమినియం గిన్నెలు, ఒక రాగి చెంబు, ఒక రాగిహరివాణం, దానిలో ఒక రాగి ఉద్ధరిణె, వీటికి పక్కగా ఓ జాజి చెక్కపెట్టె.

దానిమీద చిరిగి, చివికిపోయిన పుస్తకాల దొంతరులూ, వాటిల్లోంచి బయటికి చొచ్చుకొస్తున్న వూడిపోయిన కాగితాలు. చూలుకు వేలాడదీసిన దణ్ణెం మీద ఆరేసిన ఒక నీర్కావి పంచె, రెండు అంగ వస్త్రాలు-అన్నీ మాసికలు వేసిన బతుక్కి తార్కాణాలుగా నిలిచివున్నై.

ఆయన పడుకున్న నులక మంచం మీద వెలిసిపోయిన శాలువా పరచి వుంది. మురికిపట్టి మకిలిలాగా వుంది. తలగడ మంచం క్రింద తల

వైపు ఓ చిన్న మందు సీసా, నాలుగు మందు పొట్లాలువున్నై.

శివయ్యగారు ఈ వైపు తిరిగేరు. ఆయనకి ఎగశ్వాసగా వుంది.

వణుకుతున్న పెదవులతో మళ్ళీ మాట్లాడసాగేరు. "కళ్ళు మూసుకున్నా, తెరిచినా ముంపు వచ్చిన ఏరూ, తగలబడి ఆరిపోయిన పూరూ, ఏనుగులు తొక్కేస్తున్న అరటితోటే కనబడుతున్నయ్ రా రాజూ! అమ్మో! నా గుండెలమీద ఎవరో ప్రళయతాండవం చేసేస్తున్నారు. నా నరాలన్నిటినీ గుప్పిట్లో బిగించి పిండేస్తున్నారు. నేను చచ్చిపోతున్నాను ... అబ్బా" అంటూ మూలిగేరు. రొప్పు ఎక్కువైంది.

నాకు కుమ్ముపొగలో కూర్చున్నట్లయింది. ఆందోళన పడ్డాను. ఆయన మీదకి వంగి గుండెలమీదకి వంగి గుండెలమీద నెమ్మదిగా అరచెత్తో నిమురసాగేను. పక్కింటి సుభద్రమ్మ లోపలికొచ్చి కూర్చుంది.

క్షణాల తర్వాత ఆయన మళ్ళీ మొదలెట్టేరు. ఎండుటాకుల మీద తొండ పరుగెడుతుంటే అయ్యే ధ్వని వెలువడుతుంది - ఆయన కంఠం లోంచి.

"నేను బ్రతకను- నాకు తెలుసు. ఈ మాయదారి రోగం నా ప్రాణం తీయడానికే వచ్చింది. నువ్వే నన్ను రక్షించాలి. ఎలాగైనా నాకు ప్రాణ భిక్ష పెట్టాలి."

ఆయన కళ్ళలోకి చూసేను. నీళ్ళు పేర్కొని వున్నై. నాకు ఏమీ పాలుపోవటంలేదు. మాటలు కూడగట్టుకుని అడిగేను. "ఆచార్యులగారిని పిలుచుకురానా ?" అని.

ఆయన తల అడ్డంగా తిప్పేరు. ఉస్సురన్నారు. "ఊహుఁ ఈ మాయదారి రోగాన్ని నయంచెయ్యడం ఆయన వల్ల కాదురా. నా ప్రాణం

మీద ప్రయోగం చేస్తున్నాడు. ఆయన ప్రయోగాలకి బలై పోతానని వుందిరా, వన్నెట్టాగైనా బ్రతికించి పుణ్యం కట్టుకో"

ఆయన పరిస్థితి చూస్తుంటే నాకు మనస్సులో పునాదులు కుంగిపోతున్నట్టయింది-గుటకలు మింగుతూ అడిగేను, "పోనీ పట్నంపోదామా? అక్కడెవరన్నా మంచి డాక్టరుకు చూపించవచ్చు."

శివయ్యగారి కళ్ళలో వెలుగు ప్రవేశించింది.

"అయితే నేను ఇప్పుడే వస్తాను" అంటూ లేచాను.

"త్వరగా వస్తావుకదూ" అంటూ జాలిగా నా వైపు చూశారాయన. "ఊఁ" అంటూ బయటికి నడిచేను.

శివయ్యగారిలో తాటి ప్రమాణంలా పెరిగిన చావు భయాన్ని చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఆయన జీవితగమనమంతా నా కళ్ళముందు మెదిలింది.

ఇరవై ఏళ్ళ క్రిందట మా నాన్న పోయారు. అప్పటికి ఆయన వయస్సు ఏభై ఐదు. ఆయన, శివయ్యగారూ సుమారు ఒకే వయస్సు వాళ్ళట. అంటే ఆయనకిప్పుడు ఏ డెభ్భైఐదో వుండాలి. శివయ్యగారికి మొత్తం పదకొండుమంది సంతానం కలిగేరు. అయితే ఆయన దురదృష్టం ఏ వొక్కర్నీ సజీవంగా నిలుపుకోలేకపోయింది. పదిహేనేళ్ళక్రితం భార్య కూడా పోయింది.

నడి వయస్సులో ఆయన మావూళ్ళో వాళ్ళకి సిరిపురం బావినుంచి మంచినీళ్ళు తెచ్చిపోస్తూ జీవనం గడుపుతున్నారు.సిరిపురం మావూరికి క్రోసు దూరం. మా వూళ్ళో త్రాగే నీటి ఎద్దడి జాస్తిగా వుండేది. ఇప్పుడు కుళాయిలు వచ్చినై.

వయస్సు మళ్ళిన తర్వాత శివయ్యగారు నాగేశ్వరస్వామి ఆలయంలో పురాణం చెప్పటం మొదలెట్టారు.పురాణం చెప్పేటప్పుడు ఆయన

గీతనుంచీ, రామాయణ, భారత, భాగవతాల్లో నుంచీ, ఉపనిషత్తులోనించీ, వేదాల్లోనుంచీ ఎన్నెన్నో ఉదాహరణలతో వేదాంతసారాన్ని పిండి బోధించే వారు. "శివయ్యగారి పురాణం ఈ పూరివి మరో వెయ్యేళ్ళు "గొంగళి"గానే వుంచుతుంది" అని కుర్రకారు ఈసడించుకోవడం గూడా నాకు తెలుసు.

ఊళ్ళో ఏ శుభకార్యం జరిగినా, అశుభం జరిగినా ఆయనే కర్మకాండలు చేయించేవారు. గ్రామంలో ఎవరూ చనిపోయినా శవవాహకుల్లో విధిగా ఆయన వొకడిగా వుండేవారు. చిన్నపిల్లలుపోతే వాళ్ళనిభుజాన్న వేసుకుని పోయి అంతా అయిపోయిందనిపించేవారు. అలా మరణానికి అతి సన్నిహితంగా మెలిగి, మరణించిన వారికి విడరాని బంధువై-అంతటి అనుభవాన్ని గడించిన శివయ్యగారికి తాను చచ్చిపోతానని ఇంత భయమేఁవిటా? అని వితర్కంలో పడ్డాన్నేను.

అంతేకాదు, అశుభాలలో గరుడ పురాణం చెప్పేవారు. ఆయన పలకరింపుల ప్రహసనంలో తప్పని సరిగా ఉదహరిస్తూ వుండే-"జాతస్య మరణం ధృవమ్" సూక్తి ఎక్కడికి పోయినట్టు? అంతటి వేదాంతాన్ని వొంటబట్టించుకున్న శివయ్యగారికి చావు భయం!

కుదుట్లో ఎండిపోయే చెట్టు కొత్త కొమ్మలు వేయాలనే కోరిక ఏఁవిటి?

నాకు చప్పున సత్యం వాళ్ళ అమ్మ నిన్న సాయంత్రం అన్న మాటలు గుర్తుకొచ్చినై. "అయినా రాజూ ఆయన గురించి ఎందుకుఅంత ఆదుర్దా పడతావ్? ఆయన ఎవరికోసం బతకాలి? పెళ్ళాం, పిల్లలు లేరు. తన అన్నవాళ్ళు ఒక్క నలుసు కూడా లేదు. ఊరి జనానికి బరువు తగ్గుతుంది. రోజూ ఎవరో వొకరు విస్తరి వెయ్యాల్సిందేగా"

ఆమె మాటలకు నా మనస్సు చివుక్కుమంది. అయినా, ఆమె అన్నదీ నిజమే. అలాంటి పరిస్థితిలో వున్న శివయ్యగారికి చావు భయం.

డెబ్బయేళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో ఆయన ఈ మజిలీ తప్ప మరో మజిలీ ఎరుగరు. పట్నానికి పోయినా రాత్రికి యింటికి వచ్చే వారుట.పగ లల్లా పొట్టనాయగట్టుకుని రాత్రి ఏ అన్నపూర్ణమ్మ యింటికో వెళ్ళి అరుగు మీద భైఠాయించే వారు. ఇక ఆ తల్లి పీటవేసి విస్తరి వేయాల్సిందే!

"సినిమా ఎరుగని జీవి, హోటల్ గడప త్రొక్కని మనిషి"-ఈ కాలంలో ఎవరున్నారు-మాశివయ్యగారు కాక. అసలు ఆయన అవతారమే చిత్రమైనది. మనిషి చాలా ఎత్తరి. జుట్టుముడి, విబూది కట్లు, చెవులకి కమ్మలు, నీర్కావి పంచెకట్టు, పైనో అంగవస్త్రం, గళం మాత్రం అనర్గళం.

నిదానంగా ఆలోచిస్తే ఆయన పురాణ ప్రభావానికంటే ఆయన వాక్చాతుర్య ప్రభావానికి లోనైన మనుషుల్లో నేనూ ఒకణ్ణని చెప్పుకోవచ్చు. అందుకే ఆయనకి సన్నిహిత మైనాననుకుంటాను.

ఆయన తనచిన్ననాటి ముచ్చటలూ, చిత్రవిచిత్రమైన అనుభవాలూ హాస్యంగా చెప్తూ వుంటే వినటానికెంతో బాగుంటుంది. ఒకసారి నాటకంలో రామనాథశాస్త్రి స్టేజీ మీద రాగం తీస్తూంటే, ఈయన జనంలో నుంచీ పిల్లి కూతలు వేయడం స్టేజి మీద మరోనటుడి పంచె వూడిపోయి గలభా చేయడం వంటి విశేషాలు చెప్పేవారు.

వొకసారి పెళ్ళి వూరేగింపు పోతూవుంటే పల్లకిలోకి కొంచె వాడెవడో రాయివిసిరేట్ట. పెళ్ళి కూతురేమో ఒకటే ఏడుపుట.పెళ్ళికొడుకు 'ఉష్, ఉష్' అంటూ ఆమెను సముదాయించాడుట. ఇది చెప్పి పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వేవారు. పిల్లలకి వరసలుపెట్టి పెళ్ళిళ్ళు చేసినట్లే గేలి చేసే వారు. చిన్న పిల్లాడిలా పసిపిల్లల్ని చనువుగా దగ్గరకు తీసి 'లంజా-లమీ' అని పరాచికాలాడే వారు.

ఒకసారి రామనాథంకి, వెంకటయ్యకి చేవిగట్ల తగాదా వచ్చింది.

క్షణంలో ఊరంతా రెండు పార్టీలై పోయింది. రావిచెట్టుకింద పెద్దగలాటా మొదలైంది. అది చినికి చినికి గాలివానైంది. కుర్రకారు పౌరుషంతో వుడికిపోతున్నారు. మాటల ఈటెల్ని ప్రయోగించుకుంటున్నారు.ఆ ఉద్రిక్తతలోకి అడుగుబెట్టారు శివయ్యగారు.ఇరుపక్షాల్ని సముదాయించబోయారు. కానీ ఎవరూ వినే స్థితిలో లేరు.

వెంకటయ్య కొడుకుది మరీ దూకుడు స్వభావం. "నువ్ పక్కకి పోవయ్యా పంతులూ, నీకెందుకీ మధ్య వర్తిత్వం" అన్నాడు.

ఎవరో ఏదో అన్నారు. తప్పుకోమంటే తప్పుకోమని శివయ్యగారి మీదికొచ్చాడు అతను.

ఆయన వీడుకుండలా నిలబడ్డారు.

"ముందు నీ తల లేచిపోతుంది జాగ్రత్త" అంటూ బెదిరించాడు అతను. వెనగ్గా గడ్డపార లేచింది.

శివయ్యగారి కంఠం ఖంగున మ్రోగింది, "ఎన్ని చావులు చూశానురా నేను, నన్ను చావు పేరు చెప్పి భయపెడదామనుకుంటున్నావా? నేనెవరో తెలుసుగా.. శివయ్యని.చావుకీ నాకూ అవినాభావ సంబంధం వుంది. చావంటే పారిపోయే పిరికి వెధవని కాదు...రా" అని అడుగు ముందుకు వేశారు.

అర్ధరాత్రికిగానీ ఆ తగాదా తేలలేదు.శివయ్యగారి ధైర్యం మర్నాడు మా అందరికీ చర్చనీయాంశమైంది.

అలాంటి శివయ్యగారు చచ్చిపోతానని భయపడిపోతున్నారు.చిత్రంగా వుంది!

నేను ఆచార్లుగారిల్లు చేరుకున్నాను.

నే వెళ్ళేసరికి ఆయన కల్వం ముందు పెట్టుకుని ఏదో మందు నూరుతున్నారు. శివయ్యగారి పరిస్థితి వివరంగా చెప్పాను.

ఆచారిగారు చిత్రంగా నవ్వేరు, "చూడు రాజూ, శివయ్య వింత జీవితం గడిపేడు.నిజానికి శవవాహకత్వం అతని వృత్తి అయిపోయింది. అతనికి చావు భయం ఏమిటి? ఎందుకు? ఈదరినుంచి ఆదరి దాకా ఆయన సాగించిన ప్రయాణంలో వెంట ఎవ్వరూ లేరు. ఎవరికోసం-లేదా-ఎందు కోసం బతకాలిట ఆయన? ఏఁవంటావ్...?"

నేనే మంటాను. నా ఆలోచనలకు అంతు లేకుండా వుంది. చెరువు గట్టున నిలబడి అనంత ఆకాశంలోకి చూస్తున్నట్లు వుంది. శివయ్యగారు తనని పట్నం తీసుకు వెళ్ళమంటున్నట్టు చెప్పాను.

ఆచార్లుగారు నర్మ గర్భంగా నవ్వేరు. "పెనం మీద వేగిన గింజను విత్తుగా నాటి మొక్కగా మార్చలేవు రాజూ...ఆయన పోతే భూదేవికి ఏఁ మునిగి పోయిందటా ఇప్పుడు?" ఈయన గద్దించడం మొదలెట్టాడు.

"ఆయన కాళ్ళూ చేతులూ మాట వినటంలేదు.ఒళ్ళు నీరుసూపింది. ఎగశ్వాస చాలా ఎక్కువగా వుంది. మీరు ప్రస్తుతం ఆయన వైద్యులు గదా అని వచ్చాను. ఏదో ఒకటి చేయాలిగదా? తనను ఎలాగైనా బ్రతికించమని ప్రాధేయపడుతున్నాడు. ఒక జీవి అలా అలమటిస్తుంటే మనకేమీ పట్టనట్లు వదిలేయడం ఎలా?" కొంచెం విసుగ్గానే అడిగాను.

ఆయన విట్టూర్చాడు. "శివయ్య గుండె ఉబ్బరించింది. ఎక్కడికి తీసుకువెళ్ళినా బతుకుతాడని నాకేం నమ్మకం లేదు, ఆ తర్వాత...నీ యిష్టం, ఎలా తోస్తే అలా చెయ్యి."

ప్రెసిడెంటుగారివద్దకు పరిగెత్తాను. ఆయనకు కారుంది.వెళ్ళి పరిస్థితి చెప్పాను. కారు కావాలని అడిగేను.

"నువ్వు నాకు కావలసిన వాడివని చెబుతున్నాను. ఆ వొంటి కాయ శొంఠి కొమ్ముకోసం నీ ఆతృత ఏఁవిటోయ్. అయినా, ఒక మాట అడుగు తాను చెప్పు. శివయ్య ఏనాడన్నా ఎవరి విషయంలోనైనా పట్నం పరిగెత్తు

దామన్నాడా? ఆలోచించు. పైగా ప్రాణంపోయే జబ్బుకైనా ఆచార్లమందే అమృతం అని గదా ఆయన విశ్వాసం. తలనొప్పి-తనదాకా వస్తేగానీ తెలీదుమరి. అయినా-ఇప్పుడాయన బ్రతికి ఎవర్ని వుద్ధరించాలట. నా కారు ప్రస్తుతం నడిచేస్థితిలో లేదు. చాలా రిపేర్లు చేయించాలి."

నేను మరేంత ర్కించకుండా వచ్చేశాను. శివయ్యగారు ఎలా వున్నారో అని కడుపులో ఆందోళన ఎక్కువైంది నాకు. ప్రెసిడెంటుగారి మేడను చుట్టి రోడ్డున రాకుండా-వాళ్ళ దొడ్లో నుంచి మునసబుగారి వాముల దొడ్డి దాటి మా యింటికి వచ్చేశాను.

మా ఆవిడ-రమకి-పరిస్థితి చెప్పాను. అమ్మా, అన్నయ్యా, ఇద్దరూ కూడా విన్నారు.

రమే అన్నది, "కారు లేకపోతే ఎడ్లబండి మీద తీసుకు వెళ్తారను కోండి. అయినా ఆ మునలాయన గురించి మీ ఆందోళన ఏఁవిటి? పోనీ, హాస్పిటల్‌లో చేర్చారే అనుకోండి. ఆ తర్వాత ఎంతవుతుందో ఏఁవిటో—డబ్బు సంగతీ చూసుకోండి. మనదేఁవీ వెనకా ముందూ చూసుకోనక్కర్లేని సంసారం కాదుగదా. మనకూ నలుగురు బిడ్డలున్నారు, బాధ్యత లున్నాయి, ఆపైన మీ యిష్టం."

'ఏదేదూ సంద్రాల్ని—నా ముందు విలిపి తాను లోపలికి వెళ్ళి పోయింది. మేధస్సు వాస్తవాల్ని గమనిస్తూనే వున్నా, నాలోని ఉపాధ్యాయుడి మనస్సు ఎందుకో ముందుకు పొమ్మని తొందర చేయసాగింది.

మా అన్నయ్యని రామనాధంగారిని అడిగి బండి సిద్ధం చేయించుకుని నరాసరి శివయ్య గారింటికి రమ్మని చెప్పి లేచాను.రమ లోపల్నుంచి చెప్పింది-'అన్నం వండుతాను. తిని వెళ్ళండి' అని. 'ఫర్వాలేదులే ఇంత పొద్దునే ఏం తింటాను' అంటూ పెట్టె తెరిచి డబ్బు తీసుకుని బయటికి నడిచేను. నా వెనగ్గా మా అన్నయ్య కదిలేడు.

శివయ్య గారింటికి వచ్చేశాను. సుభద్రమ్మ బయట గడపలోనే నిల బెట్టి కంగారు కంగారుగా చెప్పింది: "ఆయనగారికి యముళ్ళు కనబడు తున్నారట. వొకటే ఏడుపు. గుండెలు ఎగిరెగిరి పడుతున్నా లబోదిబో మంటున్నాడు" అని.

లోపలికి వెళ్ళేను. ఆయన నా రాకని గమనించారు. "రాజూ... నాకు భయంగా వుంది రాజూ. నేను చావనుగాక చావను. తండ్రీ నన్ను రక్షించు...రాజూ-నన్ను బతికించు..."

శివయ్యగారిలోని చిన్న పిల్లవాడు చావు భయంతో కంపించిపోతు న్నాడు. "ఈయనకి స్పృహ తెలీయడం మనకి పెద్ద ప్రమాదంగా వుంది మాష్టారుగారూ. అసలు జబ్బుకంటే ఈ భయం జబ్బు ఆయన్ని కుంగ దీస్తోంది. ప్రాణమంటే ఈయన కింత ప్రీతి ఏమిటో" అంటూ వెళ్ళిపో యింది సుభద్రమ్మ.

—మరో కొద్ది సేపటికి ఎడ్లబండి వచ్చింది. ఊళ్ళో జనమూ మరి కొంత మంది వచ్చారు. బండిజల్లలో గడ్డిపరచి పైన శాలువా వేశాను. శివయ్యగారిని నేనూ, రామనాధంగారు కలిసి బండిమీద పరుండ బెట్టాం. నాకు సహాయంగా రామనాధమూ బయల్దేరాడు.

బండి సాగింది,-జీవితం గురించీ, జగన్నాటకం గురించీ మాట్లాడు తున్నాడు రామనాధం.

బండి డొంకన బడింది. జొన్నచేల మీద వాలిన పిట్టల గుంపుని చూస్తూ అడుగులు వేస్తున్నాను. శివయ్యగారిని గురించి వెలువడిన అభి ప్రాయాలు నా చెవుల్లో గింగురు మంటున్నాయి.

'ఆయన పోతే భూదేవికి ఏం మునిగి పోయిందిటా ఇప్పుడు?'- ఆచార్లు.

'ఇప్పుడాయన బతికి ఎవర్ని ఉద్ధరించాలి?' ప్రెసిడెంటు.

'ఆ ముసలాయన గురించి మీ ఆందోళన ఏమిటి?' రమ.

'ప్రాణమంటే ఈయనకింత తీపి ఏమిటో?'-సుభద్రమ్మ.

వీళ్ళందరి మాటల్ని-శివయ్యగారికున్న బతకాలనే బలీయమైనఆశని తలుచుకుంటుంటే ఆలోచన పీటముడి పడుతోంది.

శివయ్యగారిని హాస్పిటల్లో చేర్చాము. అక్కడి డాక్టర్లూ ఆయన బతికేదాకా నమ్మకం లేదన్నారు. మర్నాడు వస్తామని చెప్పి తిరిగొచ్చేసరికి సాయంకాలమైంది. ఊరిమధ్య దిబ్బ మీదికొచ్చాం. దిబ్బ మీద రావిచెట్టు. ప్రక్కగా బళ్ళబాట. నేను బండి వెనగ్గా నడుస్తున్నాను.

"చెరువులో ఎడ్లకి నీళ్ళు పెట్టుకుని ఇంటికి పోతాను. నువ్వు వెళ్ళు." అన్నాడు రామనాథం. నేను 'సరే' నంటూ నిమ్మళంగా కదిలేను.

కన్ను అదిరింది. ఉలిక్కి పడ్డాను. కళ్ళు నులుముకుని గబగబా అడుగులు వేశాను.

—మా యింటి ముందు రోదనలూ, ఆక్రందనలు! గుండెలు అదిరి పోయినై. ఒక్క ఉదుటున వాకిట్లో వాలేను.

మా అన్నయ్య మరి లేడు! గంట క్రితం గుండె ఆగి చని పోయాడు!

'ఎన్నో నిజాల్లో ఇదివొక నిజం' అన్న మాటని పునశ్చరణ చేసు కోసాగింది మనస్సు!

కర్మాంత రాలైనాయి. అన్నయ్యపోయిన పదమూడో రోజున—

ఆశీర్వచనాలైనాయి. పీటల మీదనుంచీ లేచాను.

"మీ అన్నయ్యని నా చేతుల మీదుగా పంపలేక పోయానే అనే నాకు బాధగా వుంది రాజూ"—

శివయ్యగారి మాటలు నాకు గొలుసుకట్టు రాతలా తోచేయి. ఆయన ముఖంకేసి చూశాను. పగిలిన అద్దంలో వికారి మొహంలా వుంది అది!

శివయ్యగారు ఎవరికోసం, ఎందుకోసం బతికినట్టు?—

అన్నయ్య ఎవరికోసం పోయినట్టు?—

అప్పటి వరకూ కాలానికి కరుణ వుందో, లేదో తేల్చుకోలేని నా మనస్సు-క్షణంలో పూవుకంటే తేలిగ్గా అయిపోయింది.

గుండె-లో అరల్లో వో మూల చిన్న దివ్వె వెలిగింది!